



'యుక్తధార' వచ్చేసింది..

- జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌లో 12 గ్రామాలు
- యాప్‌లోనే పనుల గుర్తింపు
- కేంద్రం కనుసన్నల్లో ఉపాధిహామీ
- జూన్ 18 వరకు సిబ్బందికి శిక్షణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పకడ్బందీగా నిర్వహించే దిశగా కేంద్రం మూడు సంవత్సరాలుగా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ, అందుకు సంబంధించిన లేబర్ బడ్జెట్ రూపొందించి పనులు అమలుచేస్తున్నా అనేక అక్ర మాలు వెలుగు చూస్తున్న తీరును అరికట్టే దిశగా ఇప్పటికే 2022లో దేశమంతా ఒకే విధానం ఉండే విధంగా సాఫ్ట్‌వేర్‌ల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించే టీటీఏ సాఫ్ట్‌వేర్‌ను తొలగించి నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ సర్వర్‌ను అందుబాటులోకి తీసుకవచ్చింది. గతంలో ఉపాధి పనులు ఇష్టాను సారంగా జరిగిన క్రమంలో పాత విధానాలకు స్వస్తి పలికి, కొత్త విధానాలను అమల్లోకి తెస్తూ పూర్తిగా ఉపాధిహామీ పనులు కేంద్ర కనుసన్నల్లోనే కొనసాగే విధంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ ఉండకుండా కేంద్ర ప్రభుత్వం అంతా తానై పథకం నడిపే విధంగా పనుల గుర్తింపునకు సంబంధించి యుక్తధార యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యుక్తధార పోర్టల్ ద్వారా ఉపాధిహామీ పనులను చేపట్టను న్నారు. ఇందుకోసం పైలట్ ప్రాజెక్ట్ కింద రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12మండలాల్లో 12 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. పైలట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి జిల్లాలోని ఉపాధిహామీ సిబ్బందికి హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. జూన్ 18వరకు శిక్షణ అందించనున్నారు. జిల్లాలోని గ్రామా ల్లో జరుగుతున్న పనులకు సంబంధించి తొలిదశలో యుక్తధారయాప్ జియోస్పేషియల్ ప్లానింగ్ పోర్టల్‌కు అనుగుణంగా పనిచేస్తుంది. ఉపాధి పనులను గుర్తించిన అనంతరం వాటిని జియో ట్యాగింగ్ ద్వారా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అదే విధంగా పనులకు వచ్చే కూలీల వివరాలను కూడా పొందుపర్చనున్నారు. ఎలాంటి అవకతవకలకు వీలు లేకుండా, అక్రమాలు జరగకుండా యుక్తధార యాప్ ద్వారా పారదర్శకంగా పనులు చేపట్టనున్నారు.

● జిల్లాలో 1.99 లక్షల మంది ఉపాధి కూలీలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధిహామీ పథకంలో పనిచేయడానికి జిల్లాలో 1.99లక్షల మంది కూలీలుగా నమోదయ్యారు. జిల్లాలో 98,047

మిగతా 8లో

● 12 గ్రామాలు ఎంపిక..

కేంద్ర ప్రభుత్వం తన కంట్రోల్‌లో ఉపాధిహామీ పథకం పనులు నడిచే విధం గా చర్యలు తీసుకుం టున్నది. ఇందులో భాగంగా యుక్తధార పైలట్ ప్రాజెక్టులో తొలివిడతగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 గ్రామాలను ఎంపిక చేసింది. జిల్లాలోని బోయినపల్లి మండలం విలాసాగర్, చందుర్తి మండలం మల్యాల, రుద్రంగి మండలంలో రుద్రంగి, ఇల్లంతకుంట మండ లంలో అనంతారం, గంభీరావుపేట మండలం ముచ్చ ర్ల, తంగళ్లపల్లి మండలంలో అంకిరెడ్డిపల్లె, ముస్తా బాద్ మండలంలో నామాపూర్, వేములవాడ అర్బన్ మండలంలో మారుపాక, వేములవాడ రూరల్ మండ లంలో నూకలమర్రి, కోనరావుపేట మండలంలో వట్టిమల్ల, వీర్నపల్లి మండలంలో మద్దికుంట తండా లను ఎంపిక చేసి యుక్తధార పోర్టల్ ద్వారా ఉపాధిహామీ పనులు నడిపిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశించినా కదలని అధికారులు, సిబ్బంది

- మురుగుకాలువలు అపరిశుభ్రం



కంచర్ల గ్రామంలో మట్టితో నిండిన మురుగు కాలువ

వీర్నపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం కంచర్ల వడ్డెర కాలనీలో విష జ్వరాలు ప్రబలడంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అక్కడి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి జ్వర బాధితులను పరామర్శించిన విషయం తెలిసిందే. పారిశుధ్య పనులు సరిగా లేవని కలెక్టర్ అసహనం వ్యక్తం చేసి పంచాయతీ కార్యదర్శిపై వేటు వేశారు. కలెక్టర్ ఆదేశించిన అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలోని మురికి కాలువలు చెత్త చెదారంతో నిండి మురుగు కదలడం లేదు. మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలకు ఆవాసంగా అకాల వర్షాలతో విష జ్వరాలు అధికమయ్యే అవకాశం ఉందని ప్రజలు జంకుతున్నారు. పారిశుధ్య పనులు సరిగాచేయని సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నా పనితీరు మారడం లేదని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు పలువురు కోరుతున్నారు.

వేములవాడకు పోటెత్తుతున్న భక్తులు

- 60 వేల మంది వచ్చినట్లు అంచనా



భక్తులతో కిక్కిరిసిపోయిన వేములవాడ రాజన్న ఆలయ ఆవరణ

7

కొనుగోళ్లలో జాప్యం.. మొలకెత్తిన ధాన్యం

- ఆందోళనలో రైతులు



రుద్రంగి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

8

వచ్చే దసరా పండుగను నూతన గృహంలో జరుపుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ - రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ

గంభీరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు 30రోజుల్లోగా ప్రారంభించి వచ్చే దసరా, దీపావళి పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆకాంక్షించారు. బుధవారం కలెక్టర్ గంభీరావుపేట మండలంలో రెండో విడత కింద 507 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు కేకే మహేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ మండలంలో రెండో విడత కింద 507 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారీ నుంచి పైరవీ చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయాలని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని, నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాల్లో అందుబాటులో పెడతామని తెలిపారు. మండలంలోని గ్రామాలకు ఇసుక రీచ్‌లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పంచాయతీ సెక్రెటరీ నుంచి తహసీల్దార్‌కు సమాచారం అందిస్తే వారే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారని, ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా విడుదల ఎంపిక చేస్తామని తెలిపారు. 30 రోజులలోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరు చేసిన ఇళ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి హన్మంతు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ మారుతిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



నీటినిల్వలను పరిశీలిస్తున్న డాక్టర్ సోనిమణి బృందం

వీర్నపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విధిగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వైరల్ ఫీవర్‌ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత అన్నారు. కంచర్లలో విషజ్వరాల ప్రభావంతో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని, అంటువ్యాధి నిపుణురాలు డాక్టర్ సోనిమణితో కలిసి ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఇంట్లో ఉన్న చెత్తను తొలగించి, నీరు నిల్వ ఉన్న కుండీలను శుభ్రపరచుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 10 మంది రక్త నమూనాలు సేకరించినట్లు మండల వైద్యాధికారిణి సరియా అంజూమ్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో లింగం, హెల్త్‌అసిస్టెంట్లు రమేష్, బాబు, ఎమ్ఎల్ హెచ్‌పీలు చైతన్య, స్నేహ, సూపర్వైజర్లు ఇందిరా, పద్మజ, పద్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన..

వీర్నపల్లి మండలం గర్జనపల్లి పల్లె దవాఖానలో క్షయ వ్యాధిపై వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబి స్ర్కీనింగ్ చేసి అనుమానితుల తెమడ నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. అనంతరం క్షయ వ్యాధి సూపర్వైజర్ మహిపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మంజుల ఇందిర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్

ముస్తాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జరిగిన పలు శభకార్యాల్లో, ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె తారకరామారావు శుక్రవారం పాల్గొన్నారు. బందనకల్ గ్రామంలో జరిగిన పెద్దమ్మ పెద్దిరాజు కల్యాణోత్సవ వేడుకల్లో, నామాపూర్‌లోని వరాల మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకల్లో, ఆవునూర్‌లో మడేలేశ్వరస్వామి ఆలయ వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నామాపూర్‌లో మల్లికార్జున ఆలయ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్

రైతులు వివరాలను నమోదు చేసుకోవాలి

ఇల్లంతకుంట, మే 23(ఆంధ్రజ్యోతి) రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు ఇవ్వాలని నిర్ణయించినందున వెంటనే తమ వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని ఇల్లంతకుంట, గాలిపెల్లి, పొత్తూరు, వల్లంపట్ల, పెద్దలింగాపూర్, దాచారం, రేపాక గ్రామాలలోని క్లస్టర్ రైతువేదికల వద్ద ఏఈఓలు ఉంటారని తెలిపారు. కేంద్రప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్,పంటల బీమాకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అన్నారు. రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆదార్‌కార్డు, మొబైల్‌ఫోనులు తీసుకొని రావాలన్నారు.

నకిలీ విత్తనాలను వ్యవసాయాధికారులు గుర్తించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న విత్తన డీలర్ల వద్ద ఉన్న విత్తనాలను పరిశీలించడంతో పాటు నకిలీ విత్తనాలను గుర్తించేందుకు వ్యవసాయాధికారులు చొరవచూపాలని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నకిలీ విత్తనాలపై వ్యవసాయాధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీల ఆదేశాలమేరకు జిల్లావ్యాప్తంగా వ్యవసాయాధికారులు విత్తన డీలర్ల దగ్గర ఉన్న విత్తనాలను పరిశీలించాలన్నారు. అలాగే వ్యవసాయాధికారులు, ఇతర శాఖ అధికారులు సంయుక్తంగా ఇంటర్ డివిజనల్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలను నిర్వహించాలని, తనిఖీల్లో విత్తన డీలర్ లైసెన్స్ తేదీతోపాటు లైసెన్స్ ఉన్న గోదాం, ఇంటి నంబర్, తెచ్చిన విత్తనాలకు ఇన్వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికేట్‌లను పరిశీలించాలన్నారు. అలాగే విత్తనాలకు సంబంధించి స్టాక్‌బోర్డులు స్టాక్ వివరాలను తెలుసుకోవడంతో వాటిన ధరలను చూడాలన్నారు. ఫిజికల్ స్టాక్‌తోపాటు స్టాక్ రిజిస్టర్‌లోని స్టాక్ వివరాలను సరిచూసుకోవాలన్నారు. ప్రతి రైతులకు తప్పనిసరిగా బిల్లులు డీలర్లు ఇచ్చే విధంగా చూడాలన్నారు. రైతులు వ్యవసాయధికారులు సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, మందులు ఉంటే వాటిని పక్కన బెట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లూజు విత్తనాలు అమ్మరాదన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల రవాణా, ఉత్పత్తి, విక్రయాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలు రవాణా, ఉత్పత్తి, విక్రయాలపై ప్రత్యేక నిఘా వేశామని ఎస్పీ మహేశ్ బి. గీతే పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. వానాకాలం సాగు ప్రారంభం అవుతున్న సందర్భంగా రైతన్న నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలకు జిల్లా పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నారు. నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో తరచూ తనిఖీలు చేపడుతామన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన, రవాణా చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్ నమోదుచేసి జైలుకు పంపిస్తామన్నారు. జిల్లాలోని ఫర్టిలైజర్స్, సీడ్స్ షాప్‌లపై నిఘా ఉంచి తనిఖీలు చేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికడుతామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటపుడు తప్పకుండా బిల్ తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజలు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే డయల్ 100కు లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు.

ముగ్గురు ఏఎస్‌ఐలకు పదోన్నతి



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న ఎస్‌ఐలు

సిరిసిల్ల క్రైం, మే 23(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పలు పోలీస్ స్టేన్‌లలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. జిల్లాలోని సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా ఉన్న శంకర్‌కు ఎస్‌ఐగా, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ మోతీరాంకు ఎస్‌ఐగా వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ లక్‌పతికి ఎస్‌ఐగా పదోన్నతి కల్పిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సంద్భంగా ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన శంకర్, మోతీరాం, లక్‌పతిలు ఎస్పీ మహేశ్ బీ. గీతెను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. పదోన్నతులు పొందిన పోలీసులు సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలన్నారు.

ఆపరేషన్ సింధూర్‌తో శత్రు దేశాలకు వణుకు..



తిరంగా ర్యాలీలో పాల్గొన్న వికాస్‌రావు, ప్రతాపరామకృష్ణ తదితరులు

వేములవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంతో శత్రుదేశాల వెన్నులో వణుకు పుట్టిందని బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతం అయిన సందర్భంగా శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ భారతదేశ ప్రజల మనోబలాన్ని ప్రతిబింబించిందని, సైనికులకు మద్దతుగా, వారికి గౌరవసూచకంగా పార్టీలకతీతంగా తిరంగా యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, అల్లాడి రమేష్, ఎర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వ కారణం

వేములవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణమని వేములవాడ అర్బన్ మండల విద్యాధికారి బన్నాజీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా వేములవాడజిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శుక్రవారం సైన్యానికి మద్దతుగా ప్రదర్శన నిర్వహించారు. మండల రిసోర్స్ పర్సన్‌లు కమలాకర్‌రెడ్డి, చక్రపాణి, రామచంద్రం, సదానందం, రాజు, కిషన్, వెంకటేశం, నిర్మల, శిక్షణ ఆర్గనైజర్ బొజ్జ కృష్ణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

సిరిసిల్ల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని రైతుల ధాన్యం తడిసిపోయి మొలకెత్తిందని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు నష్టాలు జరగకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు పాల్గొన్నారు.

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

సిరిసిల్ల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని బోనాల రైతువేదికలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బోనాల క్లస్టర్ వ్యవసాయ విస్త రణ అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులు పాల్గొని రైతు లకు నూతన, సుస్థిర వ్యవసాయం వాటి పద్ధతుల గురించి వివరిస్తారని తెలిపారు. క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొనాలని రాజ్ కుమార్ కోరారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి బలవన్మరణం


వెంకవ్వ (ఫైల్)

గన్నేరువరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన న్యాలపట్ల వెంకవ్వ(80) అనారోగ్యం బారినపడి మనస్తాపంతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వెంకవ్వ కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురై మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో శుక్రవారం ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా భర్త గతంలోనే మృతిచెందాడు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరపల్లిలో గుంపుల కొమురమ్మ (75) అనే వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. శుక్రవారం ఉదయం నుంచి వృద్ధురాలు కనబడకపోవడంతో గోపరపల్లి సమీపంలోని బావుల్లో వెతకగా మృతదేహం బయటపడింది. కొన్నేళ్ళుగా వృద్ధురాలు పక్షవాతంతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల ఒడ్డెర కాలనీకి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోదాసు శంకర్(37) అనేవ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు రాడ్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో రైతు చేగంటి పోచయ్య(58) అప్పుల బాధ భరించలేక తన వ్యవసాయ పొలం వద్ద ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య తన రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇద్దరు కుమారుల్లో పెద్ద కొడుకు కొమురయ్య పెళ్లి చేసుకొని అత్తగారింటి దగ్గర నివసిస్తున్నాడు. చిన్న కొడుకు రాకేష్ ఆర్థిక ఇబ్బందులతో గల్ఫ్ బాట పట్టాడు. కొడుకును విదేశాలకు పంపేందుకు, పంట పెట్టుబడి కోసం సుమారు రూ.6లక్షల వరకు అప్పులయ్యాయి. వేసిన పంటకు సరిగా దిగుబడి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మనస్తాపం చెంది పంట చేను వద్ద రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం వద్ద బుధవారం వర్షానికి తడిసి అచేతన స్థితిలో పడివున్న గుర్తు తెలియని వ్యక్తిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, తెల్లని గీత బ్లూ కలర్ రౌండ్ టీషర్ట్, బ్లాక్ కలర్ పాయింట్, ఎడమ చెవికి పోగు, బెల్ట్ ధరించి ఉన్నట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు సెల్ నంబర్లు 8712656506, 8712656507 సంప్రదించగలరని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దపల్లి మండలంలోని నిట్టూరులో చోటు చేసుకుంది. నిట్టూరు గ్రామానికి చెందిన ముక్కెర సాయికుమార్ (24) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కొన్నిరోజులుగా పనికి వెళ్ళకుండా ఖాళీగా ఉండడంతో పనికి వెళ్లమని తల్లి మందలించగా ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి కరీంనగర్ వెళ్ళాలని సూచించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి ముక్కెర వసంత ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్మన్ రావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న మినీ బస్సు

● చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిమ్మాపూర్/మానకొండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని శంషాబాద్‌కు చెందిన బాకారపు సురేష్(30) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మానకొండూర్ సీఐ సంజీవ్ కథనం ప్రకారం.. శంషాబాద్ గ్రామానికి చెందిన సురేష్, మాజీసర్పంచ్ డొల్ల రమేష్ కలిసి ద్విచక్రవాహనంపై శంషాబాద్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన మిని బస్సు వారిని ఢీ కొంది. ఈప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సురేష్ తలకు బలమైనా గాయాలు కావడంతో కరీంనగర్ అసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డే కేర్ సెంటర్లపై వృద్ధుల ఆశలు



● వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ యోచన
● రాష్ట్రంలో 37 సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు
● ఒక్కో సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు
● నెలకు రూ.90 వేల బడ్జెట్ కేటాయింపు

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న వారి కోసం ఆ భావనను పోగొట్టడానికి ప్రభుత్వం ప్రతీ జిల్లాలో డే కేర్ సెం టర్లను ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారిత శాఖ ద్వారా రాష్ట్రంలో 37 మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత ఫైల్ పై సంతకం చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం కోసం పంపినట్లు తెలుస్తోంది. సీఎం గ్రీన్‌సిగ్నల్‌తో రాష్ట్రంలోని జిల్లాల్లో ఒక్కోటి చొప్పున డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ప్రతీ నెల రూ.4.61 కోట్ల ఖర్చు

కుటుంబ సభ్యులంతా ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఒంటరితనంతో బాధపడుతున్న వృద్ధుల సౌకర్యార్థం ఈ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, హన్మకొండ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగతా 29 జిల్లాల్లో ఒకటి చొప్పున మొత్తం 37 సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అటల్ వయో అభ్యుదయ యోజన నిబంధనల మేరకు ఏర్పాటు చేయనున్న డే కేర్ సెంటర్ల నిర్వహణను వయోవృద్ధుల సంక్షేమ శాఖకు అప్పగించనున్నారు. వీటి నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల 4.61 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నారు. ఒక్కో సెంటర్ నిర్వహణకు నెలకు రూ.90 వేలు బడ్జెట్ కేటాయించనున్నారు.

సకల సదుపాయాలు

ఒక్కో డే కేర్ సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు ఉంటాయి. ఇందులో కిచెన్, వైద్యుల గది, విశాలమైన హాల్, క్యారమ్స్, టెన్నిస్, చెస్ వంటి ఆట వస్తువులతో పాటు లైబ్రరీ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. డే కేర్ సెంటర్‌లో ఇండోర్ గేమ్స్, యోగా, పుస్తకాలు, కథలు, ధ్యానం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ వారం వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను కూడా ఉచితంగా ఇస్తారు. డే కేర్ సెంటర్లకు వచ్చే వృద్ధులకు రాగి జావ, పండ్ల రసాలు, ఉప్మా, టీ, బిస్కెట్‌లు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..

బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, జగిత్యాల



వృద్ధుల సంక్షేమానికి డే కేర్ సెంటర్ల ఏర్పాటు వ్యవహారం ప్రభుత్వ నిర్ణయం మేరకు జరుగుతోంది. ప్రస్తుతం ఇందుకు అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకున్న తర్వాత విడుదల చేసే మార్గదర్శకాల ప్రకారం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం.

పోలీసుల అదుపులో మావోయిస్టు సానుభూతిపరుడు?

జగిత్యాలరూరల్, మే 23 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాలరూరల్ మండలం పొలాస శివారులో మూడురోజుల క్రితం మావోయిస్టు సానుభూతిపరుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, అతని నుంచి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకు న్నారని విశ్వసనీయ సమాచారం. జగిత్యాల మండలం ధరూర్‌లో 40ఏళ్లుగా నివాసం ఉంటున్న వ్యక్తి బండ రాళ్లకు డ్రిల్లింగ్‌వేసి జిలెటిన్‌స్టిక్స్‌తో ఉపాధి పొందున్నట్లు, ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుమానితుడికి మావోయిస్టులపై ఉన్న సంబంధాలపై పోలీసు అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్‌ను వివరణ కోరగా ఇది పూర్తిగా అవాస్తవమని ఖండించారు.

దొంగ అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపిస్తున్న సీఐ కె కృష్ణ

సిరిసిల్ల క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన వేల్పుల రాజేశ్వర్‌రెడ్డి(31) అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్లటౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. నిందితుడివద్ద 48.47గ్రాముల బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. బోయిన్‌పల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి తనభార్యతో కలిసి సిద్దిపేటలో ఉన్న తన బంధువుల పెళ్లికి వెళ్తుండగా సిరిసిల్ల బస్టాండ్‌లో తన భార్య హాండ్‌బ్యాగులో నుంచి బంగారు నల్లపూసలతాడు, ఒక జత చెవికమ్మలు, వంక ఉంగరం, చైన్ దొంగిలించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈమేరకు బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజార్‌లో అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. దొంగిలించిన అభరణాలు స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బంగారంతో వెళ్లేటపుడు రద్దీ ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలని, మహిళలు బంగారు అభరణాలతో ప్రయాణం చేసేటపుడు తోడుగా ఎవరినైనా తీసుకెళ్లాలన్నారు. రద్దీ ప్రదేశాల్లో, బస్టాండ్‌లలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తి కనిపిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఇంట్లోని బంగారు అభరణాలు, నగదును బ్యాంక్ లాకర్‌లలో భద్రపరుచుకోవడం క్షేమం ఆయన తెలిపారు.

మహిళను బెదిరించి డబ్బులు దోపిడీ

కరీంనగర్ అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన మాంకాళి మీనను శుక్రవారం ఉదయం బద్దిపెల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తి చంపుతానని బెదిరించి ఆమెవద్ద ఉన్న 4వేల రూపాయల నగదును దోచుకున్నాడని కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మీనా కమాన్‌పూర్ నుంచి కొండాపూర్‌లో శుభకార్యానికి వెళ్తోందని, బద్దిపల్లి శివారులో దోపిడీకి గురైందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కొత్తపల్లి పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగు, ఆరోసెమిస్టర్ పరీ క్షల్లో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కిమ్స్ డిగ్రీకళాశాల కరీంనగర్ ఒకరు, ప్రభుత్వ డిగ్రీకళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, ఆపూర్వ డిగ్రీకళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, చాణిక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, వాగ్దేవి, డిగ్రీ కళాశాల హుజూరాబాద్ కేంద్రంలో ఒకరు చొప్పున ఉన్నారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం


మమత(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కుచెందిన చెల్లోజు మమత(36) అదృశ్యమైనట్లు కేసునమోదు చేశామని త్రీటౌన్‌పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మమత ఆచూకీ లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదుచేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీతెలిసినవారు కరీంనగర్ త్రీటౌన్‌పోలీసులకు ఫోన్‌నంబర్ల 9392373873, 9491475061, 8712670763కు తెలపాలని సూచించారు.

బెట్టింగ్ పేరుతో మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో పెద్దహనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాది భక్తులు తరలిరావడంతో శుక్రవారం బెట్టింగ్ ముఠా సభ్యులు నిలువు దోపిడీకి గురిచేశారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌అంటూ పెట్టిన పెటుబడికి రెట్టింపుఅంటూ దోపిడీకి పాల్పడిన ముఠాను కొందరు భక్తులు గుట్టురట్టు చేశారు. దిగువ కొండగట్టులో ముఠాగా ఏర్పడి కొందరు ఆన్‌లైన్‌లో పదినుంచి ఇరవైవేలవరకు యూపీఐ పేమెంట్స్ ద్వారా తీసుకున్నారు. అయితే ముఠాలోని సభ్యులే ఇతరులను ఆకర్షించేందుకు వారు కూడా పేమెంట్స్ చేయడంతో అది తెలియనికొందరు చెల్లించారు. అనుమానం వచ్చిన ఓ భక్తుడు ముఠా నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో భక్తుని వద్ద వసూలు చేసిన ఇరవై వేల రూపాయలు తిరిగిఇచ్చి ముఠా సభ్యులు అక్కడి నుంచి జారుకున్నారు.

హత్యాయత్నంపై ముందుకు సాగని విచారణ

● కమిషనరేట్‌కే సవాల్‌గా మారిన కేసు

కోల్‌సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన పరంకుశం యశ్వంత్(36)పై జరిగిన హత్యాయత్నం కేసు విచారణ ముందుకు సాగడం లేదు. నాలుగు నెలలు గడిచినా కేసులో పురోగతి లేదు. రామాలయం సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు, ఫిజిషియన్ అసిస్టెంట్ అయిన యశ్వంత్‌పై జనవరి 7న హత్యాయత్నం జరిగింది. ఇంటివెనుక నుంచి ఇంట్లోకి చొరబడిన నిందితులు కత్తులతో అతడి తల, ముఖంపై దాడిచేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అతడి భార్య ప్రతిమ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తుంది. యశ్వంత్ ఫోన్‌లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతుండగా పోలీసులకు సమాచారంఇచ్చి అసుపత్రిలో చేర్పించారు. ఇంట్లో సీసీకెమెరాల పుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి కదలికలను గుర్తించారు. అతడి గురించి ఎంత ప్రయత్నించినా వివరాలు దొరకలేదని సమాచారం. సమీప కాలనీల్లోని సీసీపుటేజీలను పరిశీలించినా ఆధారాలు దొరకలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వారు వేలిముద్రలు లేకుండా జాగ్రత్తపడ్డారు. ఘటన జరిగిన సమయంలో నగదు, ఆభరణాలు ఉన్నా వాటిని ముట్టుకోలేదు. దీంతో ఉద్దేశ్యపూర్వకంగా దాడికి వచ్చిన వారుగాపోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కాల్‌డాటాను, ఇతర ఆధారాలను విశ్లేషించారు. కుటుంబసభ్యులు, బంధువులు, ఇతర అనుమానితుల సమాచారాన్ని సేకరించి విచారణ జరిపారు. ఎక్కడా కూడా ఆధారాలు లేక కేసు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం యశ్వంత్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడు కోలుకున్నా మాట్లాడడం, మనుషలను గుర్తు పట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈకేసు రామగుండం కమిషనరేట్‌కే సవాల్‌గా మారింది.

● అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నాం
- గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్

యశ్వంత్ హత్యాయత్నం కేసుపై అన్నీ కోణాల్లో విచారణ జరుపుతున్నాం. టెక్నాలజీని కూడా వాడుతున్నాం. పలువురు అనుమానితులను విచారించాం. ఫోన్ల డాటాను కూడా రిట్రీట్ చేస్తున్నాం. త్వరలోనే ఛేదించేలా కృషి చేస్తున్నాం.

గ్రామస్థులు ఒక్కటయ్యారు.. కబ్జా భూమిని కాపాడారు


ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన బోరును చూపుతున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

మెట్‌పల్లి రూరల్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు ఇటీవల ఆక్రమించి చదును చేసిన విషయాన్ని పలుమార్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అధికారులు సర్వే చేపట్టారు. గ్రామంలో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అందులో రెండు ఎకరాలలో మామిడి, నాలుగు ఎకరాల్లో బోర్లు ఏర్పాటు చేసుకోని వరి సాగుచేస్తున్నట్లు గుర్తించారు. అధికారులు ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అధికారులు హద్దులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించిన, చదును చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఎల్లవేని అయిలయ్య-సమ్మక్కకు ఇద్దరు కుమారులు హరీష్, జయపాల్ ఉన్నారు. వీరి ఇద్దరి మధ్య దారి విషయంలో కొంతకాలంగా గొడవ జరుగుతోంది. గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ చేసుకున్నప్పటికీ ఒప్పందం కుదరలేదు. దీంతో గురువారం సాయంత్రం జయపాల్, అతడి మామ గడ్డి కొంరయ్య ఇంట్లో ఉన్న గొడ్డలితో హరీష్‌పై దాడికి యత్నించారు. హరీష్ భార్య అనూష అడ్డుకోబోగ ఆమెకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే ఆమెను జమ్మికుంటలోని ఆస్పత్రికి ప్రథమచికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయపాల్, కొంరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు న్యాయం చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి న్యాయంచేయాలని సహచర ఎమ్మెల్యేలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గం ఏకపక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపడంతో విజయానికి ఎంతో తోడ్పడ్డారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ సామాజికవర్గంలో మూడొంతులు మాదిగలు ఉండగా కీలక పదవుల్లో మాదిగలకు చాలా తక్కువ ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. కేబినెట్లో కేవలం ఒకమాదిగ ఉపవర్గానికి మాత్రమే మంత్రి పదవి ఇచ్చారన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ఒక అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఆయన వెంట తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శ్యామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రశ్నించే వారికి బీజేపీ వేధింపులు..

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈడీ ఛార్జ్ షీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు ఉందని బీఆర్ఎస్, బీజేపీ తెగ హడావుడి చేస్తుందని ఆయన విమర్శించారు. విపక్ష పార్టీలపైన కేంద్రం ఈడీని ప్రయోగిస్తుందని, ప్రశ్నించే వారిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధిస్తుందని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి దేశంలోనే గొప్ప పేరు వస్తుందనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదం జరిగితే పట్టుకునేది ఎలా?

● ప్రమాదం జరిగే ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు ● పోలీసుల దర్యాప్తుకు ఇబ్బందిగా మారుతున్న వైనం


తుమ్మన్నపల్లి గ్రామంలో చెట్టును ఢీకొన్న లారీ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలు జరిగిన సమయంలో తప్పు ఎవరిది అన్నది తెలియకపోవడంతో పోలీసుల దర్యాప్తునకు ఇబ్బందిగా మారుతోంది. మండలంలో ఆయాగ్రామాల్లో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, అలాంటి ప్రాంతాల్లో ప్రమాదం సంభవించే ప్రాంతాలుగా అధికారులు గుర్తించి వాటివద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు లేకపోవడంతోనిందితులను పట్టుకోవడం అధికారులకు సవాల్‌గా మారుతోంది.

● ప్రమాద జరిగే ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు

కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ఉన్న తుమ్మన్నపల్లి, సింగాపూర్, లింగాపూర్ క్రాస్‌రోడ్డులవద్ద తరుచూ రోడ్డుప్రవదాలు జరుగుతుంటాయి. రాత్రివేళల్లో లారీ డ్రైవర్లు వేగంగా వస్తున్న వేళ ద్విచక్రవాహనాదారులు ప్రాణాలను అరచేతిలో పెటుకొని నడుపుతున్నారు. ఈ సమయంలో అనుకొని ప్రమాదం జరిగితే తప్పు లారీడ్రైవర్‌దా లేక ద్విచక్రవాహనదారుడిదా అనేది తెలియడంలేదు. కారణం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడమే. అలాగే పర్కాల్ క్రాస్‌రోడ్డు వద్ద, హుజూరాబాద్ నుంచి జమ్మికుంట పట్టణానికి వెళ్లేదారిలో రంగాపూర్ నుంచి మొదలు శాలపల్లి-ఇందిరానగర్ గ్రామాల వరకు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేక పోవడంతో ప్రమాద ఘటనపై బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసునమోదు చేసినవేళ టెక్నికల్‌గా నిందితులను పట్టుకోవడం పోలీసులకు ఇబ్బందిగా మారుతోంది.

● రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది..
- బాపవేని రాజేష్‌యాదవ్, గ్రామస్థుడు,సింగాపూర్



కరీంనగర్-వరంగల్ రహదారి మా గ్రామం గుండా వెళ్తుంది. ఈ గ్రామంలో నెలలో మూడు, నాలుగు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో తప్పు ఎవరిదో అర్థం కావడంలేదు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి.

● ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో భద్రత చర్యలు తీసుకోవాలి
-బింగి కరుణాకర్, మాజీసర్పంచ్, రంగాపూర్



ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు వెంటనే గుర్తించి, ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లను, రెడ్ స్టికర్స్‌లను ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగే ప్రాంతమంటూ హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులు ప్రమాదాలబారిన పడకుండా చూడాలి.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖఅధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.2025-26విద్యాసంవత్సరానికి ప్రాంతీయక్రీడాహాస్టల్ హనుమకొండ, అథ్లెటిక్స్ అకాడమీఖమ్మం, సైక్లింగ్,రెజ్లింగ్ అకాడమీ, ఉస్మానియాయూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్, హాకీఅకాడమీ వనపర్తి, సరూర్‌నగర్, వాలీబాల్‌అకాడమీ రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

● **అకాడమీలు, ఎంపిక తేదీలు**

సిద్దిపేట వాలీబాల్‌అకాడమీలో ప్రవేశానికి జూన్1న సిద్దిపేటలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. సైక్లింగ్,రెజ్లింగ్ అకాడమీలకు ఉస్మానియాయూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్‌లో జూన్10,11తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. రీజనల్‌స్పోర్ట్స్ హాస్టల్ హనుమకొండలో ఎంపికపోటీలను జూన్ 10,11తేదీల్లో నిర్వహిస్తారు. వాలీబాల్ అకాడమీలు సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో ప్రవేశాలకు ఎంపికపోటీలను రాజన్నసిరిసిల్ల, వాలీబాల్ అకాడమీలో జూన్10వ తేదీన నిర్వహించనున్నారు. హాకీ అకాడమీ వనపర్తిలో ప్రవేశాలకు డీఎస్‌ఏ వనపర్తిలో జూన్ 12న, అథ్లెటిక్స్ అకాడమీ ఖమ్మంలో ప్రవేశాలకు డీఎస్‌ఏఖమ్మంలో జూన్ 12న ఎంపికపోటీలను నిర్వహించనున్నారు. వాలీబాల్ అకాడమీ మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలకు డీఎస్‌ఏ మహబూబ్‌నగర్‌లో జూన్ 12,13తేదీల్లో నిర్వహిస్తారు.ఆసక్తిగల క్రీడాకారులు జననధ్రువీకరణపత్రం, సంబంధిత సర్టిఫికెట్‌లతో ఆయా తేదీల్లో సంబంధిత అకాడమీల్లో రిపోర్టు చేయాలని క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లా అండర్-17 చదరంగం ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాఅండర్-17 బాలబాలికల చదరంగం ఎంపికపోటీలను ఆదివారం జిల్లాకేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్‌అకాడమీలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ అంతగిరిరాజేంద్రప్రసాద్ తెలిపారు. 2008జనవరి1తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు శనివారం సాయంత్రం 5గంటలలోగా 9390177607నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్‌అండ్‌నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానాకన్) ఆధ్వర్యంలో డాక్టర్ రాష్ట్ర సదస్సును శనివారం నుంచి కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తానాకాన్ ఆర్గనైజింగ్‌చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు500నుంచి800 మంది డాక్టర్లు ఈసదస్సుకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతఅధునాతన వైద్యవిధానం, చికిత్స తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఫిబ్రవరి 2025లో నిర్వహించిన డిగ్రీ, ప్రథమ, ద్వితీయ, తృతీయసెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదలచేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



దేవాలయంలో భక్తుల రద్దీ



సరస్వతి నది తీరాన భక్తులు



పుష్కర తీరం

పులకించిన భక్తజనం

● హాజరైన హంపి పీఠాధిపతి

● తొమ్మిదో రోజు 1.3 లక్షల మంది భక్తుల పుణ్యస్నానాలు



కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం 1.3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరాలకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో చీరె, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలి దానధర్మాలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. భక్తులకు స్వామీజీ ప్రసాదాలను పంపిణీ చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో నదిలో పుణ్యస్నానం ఆచరించి ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ శేష వస్త్రాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

● **కన్నుల పండువగా హారతి**

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాశీ పండితుల ఆధ్వర్యంలో హారతిని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ పండితులకు స్థానిక అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పూర్ణాహుతులతో హారతి సమర్పించారు. ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాల ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టం అని అర్చకులు తెలిపారు.







భక్తుల పుణ్యస్నానాలు

వేములవాడకు పోటెత్తుతున్న భక్తులు

● రోజురోజుకు పెరుగుతున్న తాకిడి

● 60వేల మంది వచ్చినట్లు అంచనా



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. వేసవి సెలవులు, రాజన్న ఆలయం జూన్ 15వ తేది వరకు మూసివేస్తారని ప్రచారం జరగడంతో భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. శుక్రవారం రాజన్నను 60వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ఆవరణ రద్దీగా మారిపోయింది. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు రాజన్న దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు తెలుస్తోంది.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రం లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హనుమాన్ భక్తులరద్దీ నెలకొంది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికితరలివచ్చారు. కొండగట్టు ఆంజనేయ స్వామిదర్శనం అనంతరం అనేకమంది హనుమాన్ దీక్షాపరులు క్షేత్రానికి వచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేక పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం స్వల్పంగా వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 11.781 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 652క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మహిళా హోంగార్డును అభినందించిన ఎమ్మెల్యే

● నగదు ప్రోత్సాహకం అందజేత



ప్రోత్సాహకం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళా హోంగార్డును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం కరీంనగర్‌లోని క్యాంప్‌ఆఫీస్‌లో శుక్రవారం సత్కరించారు. కొండగట్టులో జరిగిన పెద్ద హనుమాన్ జయంతికి వచ్చిన చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన వృద్ధురాలు బండారి శంకరమ్మ గురువారం అస్వస్థతకు గురై అయి పడిపోయింది. సమీపంలో విధులు నిర్వహిస్తున్న మహిళ హోంగార్డు కేసరి స్వరూప తన భుజాలపై మోసుకెళ్లి వైద్య శిబిరానికి తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మహిళహోంగార్డును శాలువతో సత్కరించారు. ఆమె సమయస్ఫూర్తిని అభినందించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, దొంగ ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాల అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జగిత్యాల జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులను శనివారం మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీలను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గువ్వ శ్రీనివాస్, పాదం మహేందర్‌తోపాటు కవిగాయకుడు జలపతి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 100మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన సుమారు 15మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లాక్రీడల అధికారి రవికుమార్, జిల్లాబాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, జాయింట్ సెక్రటరీ అరుణ్, సభ్యులు మహిపాల్, రాజు, రాజేందర్, పాదం తిరుపతి, కోచ్‌లు వంశీకృష్ణ, నవీన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు

మల్లాపూర్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలోని అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో కొత్త కుండలను అలంకరించి బోనాం తయారు చేశారు. భక్తులు బోనం నెత్తిన ఎత్తుకుని గ్రామంలోని పురవీధుల గుండా రాగా మహిళలు మంగళహారతులు, గంగపుత్రుల సంప్రదాయ వృత్తికి సంబంధించిన గొళ్లెంవిన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టు ప్రదిక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రేడ్డు రాజు, సంఘం సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లిలో బోనాలతో గంగమ్మతల్లి ఆలయానికి బయలు దేరిన భక్తులు

అంజన్నా.. వెళ్లొస్తాం..


● ముగిసిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ● నేటి నుంచి ఆర్జితసేవలు పునరుద్ధరణ



ఆలయ ఆవరణలో భక్తులు



కోనేరులో తొలగించిన నీరు



మెట్లపై బురద

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి వేడుక లు ఘనంగా ముగిశాయి. చివరిరోజు గురువారం అర్ధరాత్రి వరకు భక్తులతో కొండగట్టు కిక్కిరిసి పోగా శుక్రవారం కూడా రద్దీ నెలకొంది. వేలాదిగా హనుమాన్ భక్తులు దీక్షవిరమణ మండపంలో మాలవిరమణ చేసి అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులు జరిగిన జయంతికి లక్ష లాదిగా వచ్చిన భక్తులు వెళ్లొస్తాం.. అంజన్న.. చల్లంగా చూడు.. అంటూ తిరిగి వెళ్లారు.

ఉత్సవాలు విజయవంతం..

జయంత్యుత్సవాలు విజయవంతంగా ముగియడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ దేవస్థానం తరుపున అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పర్యవేక్షణలో భక్తులకు సేవలు అందించిన పోలీస్, పంచాయితీరాజ్, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, వైద్య, అగ్నిమాపక, 108, రెవెన్యూ, దేవాదాయ, మిషన్ భగీరథ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను కొనియాడారు. అందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతం అయినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి వాహన పూజలు..

హనుమాన్ జయంతి సందర్భంగా నిలిపివేసిన అర్జిత సేవలను తిరిగి కొనసాగించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. శనివారం నుంచి వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు తదితర పూజలు యథావిధిగా ఉంటాయని భక్తులు గమనించాలని సూచించారు.

వందలాది సిబ్బంది ఉన్నా.. లోపించిన పారిశుధ్యం

హనుమాన్ జయంతి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు కొండగట్టుకు తరలిరాగ కొండపై అపరిశుభ్రత భక్తులను అసహనానికి గురిచేసింది. అడుగడుగున చెత్త దర్శనం ఇవ్వగా స్నానాలు చేయడానికి కోనేరుకు వెళ్లే మార్గం ద్వారం వద్దే బురదతో పాటు భక్తులు సమర్పించిన తలనీలాలు, చెత్తకుప్పలు ఉండడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. స్వామి వారి దర్శనం చేసుకొని వచ్చే వెనుక ద్వారం మెట్లన్నీ బ్లీచింగ్‌తో బురదగా మారి భక్తులు కొందరు జారిపడ్డారు. ఆలయంలోనూ భక్తులు వచ్చే మార్గంలో ముడుపుల బియ్యం కుప్పలుగా ఉండగా వాటిని వెంట వెంటనే తొలగించకపోవడంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి. పారిశుధ్యం కోసం సుమారు నాలుగు వందల పైగా సిబ్బందిని నియమించినప్పటికీ అపరిశుభ్రతే దర్శనం ఇవ్వడంపై భక్తులు, దీక్షాపరులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



ఆలయ ఆవరణలో భక్తులు చెల్లించుకున్న ముడుపులు

బియ్యం అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు

- శ్రీనివాస్, తహసీల్దార్, చందుర్తి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి? లబ్ధిదారులు ఎంతమందిఉన్నారు?

తహసీల్దార్ : మండలంలో 10932 కార్డులు ఉండగా, 31568 మంది లబ్ధిదారులు ఉన్నారు. 1894 క్వింటల్లా 8 కిలోల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలోని అన్ని రేషన్ షాపులకు సన్న బియ్యం పంపిణీ చేశారా?

తహసీల్దార్ : మండలంలో 19 రేషన్ షాపులు ఉన్నాయి. అన్ని షాపులలో సన్న బియ్యం పంపిణీ జరుగుతున్నది.

ఆంధ్రజ్యోతి : రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

తహసీల్దార్ : బియ్యం అక్రమ రవాణా జరగడం లేదు. సన్న బియ్యం పంపిణీ ప్రారంభం నుంచి ప్రతి ఒక్క లబ్ధిదారుడు బియ్యం తీసుకెళ్తున్నారు. ఎవరైనా బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే పీడీఎస్ 6ఏ కేసు బుక్ చేస్తాం. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్ : మీసేవ ద్వారా 360 ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయి.తల్లిదండ్రులతో ఉన్న రేషన్‌కార్డులో పేరు తొలగించిన వారికి, నూతనంగా కార్డు ఇస్తాం.

- చందుర్తి(ఆంధ్రజ్యోతి)

'యుక్తధార' వచ్చేసింది..

(5వ పేజీ తరువాయి)

జాబ్ కార్డులు ఉండగా, లక్షా 99 వేల 950 మంది కూలీలు ఉన్నారు. ఇందులో 1,01,393 మంది మహిళా కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్‌కార్డులు 60,431 ఉండగా 92589 మంది ఉన్నారు. జిల్లాలో గంభీరావుపేటలో 27,062 మంది కూలీలు ఉండగా, కోనరావుపేటలో 23,687మంది, బోయినపల్లిలో 15,059 మంది, చందుర్తిలో 16,869 మంది, ఇల్లంత కుంటలో 20,521మంది, ముస్తాబాద్‌లో 18,372 మంది, వేములవాడలో 7,138మంది, ఎల్లారెడ్డిపేటలో 27,716 మంది, రుద్రంగిలో 6,186 మంది, తంగళ్లపల్లిలో 17,078 మంది, వీర్నపల్లిలో 9,804మంది, వేములవాడ రూరల్‌లో 10,458 మంది కూలీలు ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ కూలీలకు కూలీ రూ.307నిర్ణయించారు. ఉపాధిహామీ పనులు మరింత పకడ్బందీగా నిర్వహిం చడానికి నిరంతరం నిఘా పర్య వేక్షణ కోసం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన కమిటీల్లో ఐదుగురు సభ్యులతో వీఎంసీ కమిటీ పని చేయనుంది. ఇందులో మండల ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళ సంఘం, స్వచ్ఛంద సంస్థ, ఉపాధిహామీల కూలీల నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, స్వశక్తి సంఘాల మహిళలు ఉంటారు. ఇందులో ఎస్సీ ఎస్టీలకు చెందిన వారిని కూడా భాగస్వాములు చేస్తారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే పూర్తిగా ఉపాధిహామీ పనిచేయనుంది.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కోనరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖలో వాచర్‌గా పని చేసిన మెరుగు రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన ఐక్యవేదిక నాయకుడు బానోతు నరేష్ కోరారు. అనారోగ్యంతో మృతి చెందిన రాములు కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేసి మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా అటవీ శాఖలో పనిచేశాడని, అనారోగ్యంతో మృతిచెందాడని అన్నారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్, రాజు నాయక్, గోపాల్ నాయక్, కరుణాకర్, నారాయణ, సత్తయ్య, భూమ రాజు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్, నర్సింహులపల్లి, తాడూరు, మండేపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు చెక్కులను మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అరపల్లి బాలు, తిరుపతిరెడ్డి, ప్యాక్స్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, మల్లేశం యాదవ్ జనార్దన్‌రెడ్డి, శ్రీరామ్‌గౌడ్, రంగు శ్రీను, లక్ష్మణ్, నరసయ్య, అంజయ్య, వెంకట రెడ్డి, యాస రాజేష్, దానవేని పెద్దయ్య, గోనేపల్లి అంజయ్య, దాసరి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, దీనిని ప్రజలందరు ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవనంలో శుక్రవారం జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. జూన్ 12వ తేదీన సిరిసిల్ల పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో జరిగే సీపీఐ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు బుస్సావేణు, నాయకులు బోజ్జ కనుకయ్య, చెన్నమనేని పురుషోత్తంరావు, పోకల సాయికుమార్, బడే స్వామిదాస్, ఎలిగేటి రాజశేఖర్, మీసం లక్ష్మన్, శేఖర్, మంద సుదర్శన్, తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, పరు శరాములు, సిద్దయ్య, బాలరాజు, శంకర్, అనందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి - ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కేకే

వీర్నపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు. పేదింటి బిడ్డలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి వారి కళ్ళల్లో ఆనందం చూస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి మండలంలో ప్రతి పేద బడుగు బలహీన వర్గాలందరికీ పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు అన్నారు. ఇల్లు నిర్మించే లబ్ధిదారులు నేరుగా అధికారులను సంప్రదించి విడతలవారీగా డబ్బులు తీసుకొని నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, హౌసింగ్ పీడీ రవిశంకర్, మండల ప్రత్యేక అధికారి అజ్మీర రాందాస్, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, హౌసింగ్ ఏఈ చైతన్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం.. మొలకెత్తిన ధాన్యం



ఎల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం



మల్లారెడ్డిపేటలో మొలకెత్తిన వడ్లను చూపిస్తున్న రైతు

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొలకెత్తింది. కొనుగోళ్లలో జాప్యం వల్ల కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయింది. అకాలవర్షాలకు ధాన్యం మొలగెత్తడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● గంభీరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం మొలుకెత్తుతున్నాయి. కొనుగోళ్లలో జాప్యంతో వడ్లు మొలకెత్తుతున్నాయని రైతు కాస బాలయ్య వాపోయాడు. ఓవైపు రోజూ వర్షాలు కురుస్తుండటం, మరోవైపు కొనుగోళ్లలో జాప్యంతో ఈ పరిస్థితి నెలకొందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

● రుద్రంగి మే 23 (ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. అలాగే భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ఇప్పటికైనా తడిసిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని రైతులకు కొరుతున్నారు.

అద్దె భవనంలో అన్నీ సమస్యలే..

- ప్రధాన రోడ్డుకు ఆనుకొని తహసీల్దార్ కారాలయం - వాహనాల పార్కింగ్ సమస్య.. - వృథాగా ఉన్న మహిళా భవన్‌కు మార్చాలని డిమాండ్



ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న మూలమలుపు

తంగళ్లపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయంలో అన్నీ సమస్యలే.. ప్రజలకు పార్కింగ్ స్థలం ఉండదు. సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిని ఆనుకొని ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తుండగా ప్రజలు భయంభయంగా కార్యాలయానికి వచ్చే పరిస్థితి నెలకోంది. ఏడేళ్ల క్రితం తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయం తంగళ్లపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అరకొర వసతులతో కార్యాలయం కొనసాగుతోంది. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం మానేరు నది ఒడ్డున సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారి పక్కన అద్దె భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చారు. ఏడేళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు స్వంత భవనం నిర్మించపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అద్దె రూపంలో లక్షల రుపాయాలు వృథా అవుతున్నాయి.



మండల పరిషత్ ఆవరణలో వృథాగా ఉన్న మహిళా భవన్

తరచూ ప్రమాదాలు..

తహసీల్దార్ కార్యాలయం ముందు వాహనాలు నిలపడానికి స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై ప్రమాదకరమైన మూలమలుపు ఉంది. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యలయం ఆవరణలో రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోక వృథాగా ఉన్న మహిళా భవన్‌కు మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అద్దెరూపంలో చెల్లిస్తున్న నిదులు మిగలడంతో పాటు మండల పరిషత్ కార్యలయం, తహసీల్దార్ కార్యాలయాలు ఒకే అవరణలో ఉండడం ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఉన్నాతాధికారులు చొరవ తీసుకుని నిర్మాణం పూర్తి చేసుకుని రెండేళ్ల గడిచినా ఇప్పటివరకు ప్రారంభనానికి నోచుకోక వృథాగా ఉన్న మహిళా భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి మార్చాలి..

- శ్రీనివాస్‌రెడ్డి, రైతు



తహసీల్దార్ కార్యాలయాన్ని మండల పరిషత్ ఆవరణలో వృథాగా ఉన్న మహిళా భవన్‌లో మార్చాలి. పార్కింగ్ లేక ప్రధాన రోడ్డు పక్కన అద్దె భవనంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని తహసీల్దార్ కార్యాలయాన్ని మహిళా భవన్‌లోకి మార్చేలా చర్యలు తీసుకోవాలి

పార్కింగ్‌కు ఇబ్బంది ఉంది..

- జయంత్‌కుమార్, తహసీల్దార్



కార్యాలయ ప్రదేశంలో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది ఉంది. అయినప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడకుండా సిబ్బంది వాహనాలు పార్కింగ్ చేయడంలో సహకరం అందిస్తున్నారు. మహిళా భవన్ వృథాగా ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాను.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలి



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

కోనరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో శుక్రవారం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీవర్ సర్వేలను నిర్వహించారు. సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ్, చందు, ఏఎన్ఎం జ్యోతి, జిపి కార్యదర్శి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి..

గంభీరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన అంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ఫొటో పెట్టకపోవడమేనా అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి ప్రశ్నించారు. గంభీరావుపేటలోని బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా కేటీఆర్ పెట్టక ప్రోటోకాల్ పాటించకపోవడం పద్ధతి కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రతి అధికార కార్యక్రమంలో వేరే పార్టీకి చెందిన ఎంపీ ఫోటో పెట్టామని గుర్తు చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, నాయకులు లక్ష్మణ్, లింగమ్ యాదవ్, రాజేందర్, మల్లేశం, వహీద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి మే 23 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్దమ్మ జాతరలో భాగంగా శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించి పెద్దమ్మకు నైవేద్యం సమర్పించారు. గ్రామంలో సంఘం సభ్యులు ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్లతో సంఘ సభ్యులు, యువకులు ఆలయానికి బయలుదేరారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. పెద్దమ్మ జాతర సందర్భంగా నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గండి నారాయణ, కొమిరె శంకర్, నరసయ్య, పోగుల పెద్దరాజం, సంఘం సభ్యులు, యువకులు, మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. భవనం అప్పగించక..



పల్లె దవాఖాన భవనం

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పల్లె దవాఖాన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో రూ. 20 లక్షల నిధులతో భవన నిర్మాణాన్ని చేపట్టింది. పనులు పూర్తియి యేడాది గడుస్తున్నా బిల్లులు రాక కాంట్రాక్టర్ పల్లె దవాఖాన భవనాన్ని అప్పగించడం లేదు. దాంతో పేద ప్రజలకు సర్కారు వైద్యం అందకుండాపోతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బిల్లులు చెల్లించడంతో పాటు పల్లె దవాఖానను అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని గ్రామాల్లో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేయనుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో లబ్ధిదారులు తలపెట్టిన ఇళ్లకు ఇసుక కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ధృవీకరణ పత్రం అందిస్తే ఎలాంటి చాలాన్ లేకుండానే సమీప వాగు నుంచి ఇసుకను తరలించుకోవచ్చని అన్నారు. ఇసుక రవాణాలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని నర్సయ్య కోరారు.

కూలిన ఆలయాన్ని పరిశీలించిన అధికారులు

ఇల్లంతకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలోని నిర్సంహ్మాస్వామి ఆలయాన్ని అధికారులు పరిశీలించారు. పురాతనం అయిన నర్సింహ్మాస్వామి ఆలయంపైకప్పు గురువారం కూలింది. విషయం తెలుసుకున్న అధికారులు శుక్రవారం ఆలయాన్ని పరిశీలించి, దేవాదాయశాఖకు నివేదికలు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఈవో మారుతిరావు, ఆర్ఐ సంతోష్, అసిస్టెంట్ ప్రభాకర్, నాయకులు కాథ మల్లేశం, రాజిరెడ్డిలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఇల్లంతకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి) : తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు నాయకుడు అక్కెం నాగరాజు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకవచ్చి నెలరోజులు గడిచిపోయిందన్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లనే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మిగిలిపోయిందన్నారు. నారుపోసే సమయం వచ్చినా రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని వెంటనే తూకంవేసి తరలించాలని కోరారు.

జగదాంబ దేవి, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకులు

- హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

రుద్రంగి, మే 23 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం దేగావత్ తండా గ్రామంలో జగదాంబ దేవి, సేవాలాల్ నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన ఆలయంలో గ్రామస్థులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగంస్వరూపరాణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, నాయకులు గంగంమహేష్, మంచె రాజేశం, దయ్యాల కమలాకర్, కంటె రెడ్డి, చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్, రాందాస్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం



ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఇల్లంతకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తహసీల్దార్ ఫారూఖ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం సాయిజ్యోతి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో మహిళా సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తుండటం వల్ల ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏపీఎం వాణిశ్రీ, వీవో అధ్యక్షురాలు అంతగిరి సరస్వతి, సీఏ వినోద, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎలగందుల ప్రసాద్, సఫియా, రేష్మ, అనురాధ, స్వాతిలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందజేత

కోనరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన పాడి రైతు జాగిరి ఎల్లవ్వ, అంజయ్య కూతురు గంగ భవాని పెండ్లికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలను అందజేశారు. ప్రతి పాడి రైతు కూతురు పెళ్లికి గత కొన్ని సంవత్సరాలుగా పుస్తె మట్టెలను కరీంనగర్ డెయిరీ ద్వారా అందజేస్తున్నామని సూపర్‌వైజర్ ఎల్లయ్య తెలిపారు. జిల్లా అనిల్, అంజిరెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి పెళ్లికి చేయూత

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన పేద యువతి గడ్డమీది అర్పిత పెళ్లికి ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం చేయూతను అందించారు. పుస్తె మట్టెలు, చీరను అందజేశారు. స్థానిక మాజీ ఏఎంసీ చైర్మన్ రమేశ్ రూ.5 వేలు వితరణ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పోలీసులు, అధికారులు సమకూర్చిన రూ.12.7 వేల విలువైన కానుకను అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఇటీవల మృతి చెందిన యువతి ముద్రకోల అంజలి కుటుంబానికి అరుణాచలం వాట్సప్ గ్రూప్ మిత్ర బృందం సభ్యులు రూ.4 వేల నగదును శుక్రవారం వితరణ చేశారు. శ్రీధర్, దేవయ్య, రమేశ్, గణేశ్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ముసుగులో దోచుకున్నారు..

తంగళ్లపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ ముసుగులో దోచుకున్నది బీఆర్ఎస్ నాయకులని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలే తన ప్రొటోకాల్‌గా ప్రజల మధ్యలో ఉంటున్న వ్యక్తి కేకే మహేందర్‌రెడ్డిగా అభివర్ణించారు. అధికారం పోయాక మతిభ్రమించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని తోట అగయ్య, కొండూరీ రవీందర్‌రావులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షులు నేరల్ల నరసింగంగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, వేల్పుల సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.